క్లుప్తంగా

దట్టీ సమర్పణ



మచిలీపట్నంటౌన్: మొహర్రం దుఃఖదినాల్లో భాగంగా పదో రోజైన శుక్రవారం 33వ డివిజన్‌లోని ఇమామ్ పంజాలోని భారీ ఇమామ్ పీర్లకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) దట్టీ సమర్పించారు. మెహంది పంజా నుంచి బయలుదేరి దట్టీని ఊరేగింపుగా తీసుకువచ్చి భారీ ఇమామ్ పంజాకు చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్ దాదా, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ మచిలీపట్నం డిపో పరిధిలో ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డీఎం టి. పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ప్రయాణికులు 99592 25462 నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సమస్యలు తెలపాలని ఆయన కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత

బంటుమిల్లి: పెందుర్రు గ్రామానికి చెందిన పాలపర్తి వెంకటేశ్వరరావు ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ. 10వేలను తక్షణసాయంగా శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు ఎంపీటీసీ మాదాసు లక్ష్మీశకుంతల అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మాదాసు వెంకటేశ్వరరావు, టీఏ శ్యామ్, 10 వార్డు సభ్యురాలు ఆకుల సమలత పాల్గొన్నారు.

స్మార్ట్ టీవీల ఏర్పాటు

గూడూరు: నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచి యక్కల మాధవి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు విద్యా బోధన చేయడానికి 7 ఇంట్రాక్టివ్ ప్లాట్ ప్యానెల్స్‌ను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. స్మార్ట్ టీవీల ద్వారా 3,4,5 తరగతులకు పాఠాలు చెపుతారని వివరించారు. ప్రధానోపాధ్యాయిని జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు యక్కల నాగరాజు పాల్గొన్నారు.

కార్తీక్‌కు పీహెచ్‌డీ ప్రదానం



కోనేరుసెంటర్: కృష్ణా యూనివర్సిటీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో విద్యార్థి కార్తీక్ గున్నకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి శుక్రవారం పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ఏ స్టడీ ఆన్ కార్టూన్స్ యాజ్ యాన్ ఎఫెక్టివ్ విజువల్ కమ్యూనికేషన్ ఇన్ ప్రింట్ మీడియా అంశంపై కార్తీక్ చేసిన పరిశోధనకుగానూ పీహెచ్‌డీ పట్టాను అందజేశామని వీసీ జ్ఞానమణి తెలిపారు. కార్తీక్‌ను వీసీతో పాటు రెక్టార్ ప్రొఫెసర్ డి. సూర్యచంద్రరావు తదితరులు అభినందించారు.

విద్యుత్ సమస్యలపై సమాచారం ఇవ్వండి

మచిలీపట్నంటౌన్: వర్షాలు, ఈదురుగాలులకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను వినియోగదారులు ఎప్పటికప్పుడు వారి పరిధిలోని విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని విద్యుత్ ఈఈ మన్నెం భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ స్తంభాలు, ఇనుప స్తంభాలు, విద్యుత్ వైర్లపై కొమ్మలు పడిన చెట్లను ముట్టుకోరాదన్నారు. తడిచేతులతో ఇంట్లోని స్విచ్‌లను వేయవద్దని చెప్పారు.

10 ఆటోలు, 8 బైక్‌లు సీజ్

నాగాయలంక: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 10 ఆటోలు, 8 బైక్‌లను సీజ్ చేశామని నాగాయలంక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. సిబ్బందితో కలిసి జరిపిన తనిఖీల్లో లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్, పర్మిట్‌లు, పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని వాహనాలను సీజ్ చేశామని ఆయన వివరించారు.

రజత వర్ణ శోభితం



నాగాయలంక: గత వారం రోజులుగా కొనసాగిన ముసురు వీడింది. శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో నీలాకాశం వెండి మేఘాలతో ఆకట్టుకుంది. భానుడి లేలేత కిరణాలు తాకడంతో రజత వర్ణ శోభితమైంది. ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది.

మొక్కల పెంపకంతో ప్రకృతి పరిరక్షణ

- వాడవాడలా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం
- మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు



పులిగడ్డలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మచిలీపట్నంటౌన్: మొక్కలను పెంచడం ద్వారా ప్రకృతి పరిరక్షణ సాధ్యమవుతుందని పలువురు ఉపాధ్యాయులు, అధికారులు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. నగరంలోని లేడీయాంప్థిల్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయిని నిర్మలా జ్ఞానమణి మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ సమతుల్యత, ప్రకృతి చాలా వరకూ దెబ్బతింటోందన్నారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

రేమాలవారిపాలెం(నాగాయలంక): మొక్కల పెంపకాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని, ధరిత్రిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని రక్షిస్తుందని నాగాయలంక జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దివి ఏఎంసీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నంద్యాల కోటేశ్వరరావు, నాయుడు దుష్యంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి..

గూడూరు: పచ్చదనం పరిరక్షణలో భాగంగా శుక్రవారం గూడూరు మండలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ వై.శివశంకర్, ఆర్‌ఐ నస్రీన్ ఆరా, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తుమ్మలపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని ఉండి రాణి చిన్నారులతో మొక్కలు నాటించారు. కప్పలదొడ్డి ఆరోగ్య ఉపకేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మొక్కలు నాటారు. మల్లవోలు ఆర్బీకే పరిధిలో వీఏఏలు, వలంటీర్లు మొక్కలు నాటారు.

మోపిదేవిలో..

మోపిదేవి: పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఎంపీపీ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల చెట్లుగా పెరిగి మానవాళికి ఆక్సిజన్ అందిస్తాయని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఏపీఎం శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవకృష్ణ, ఎన్ఆర్ఈజీఎస్ టీఏ హరిబాబు నాయక్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: శుక్రవారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వాటి అనుబంధ కార్యాలయాల్లో మహిళలు మొక్కలు నాటారు. పలువురు మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో పెరుగుతున్న కాలుష్యాన్ని మొక్కల పెంపకం ద్వారానే అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు. ప్రతి మనిషి తన జీవితంలో ఒక మొక్కను నాటి దాన్ని పూర్తి స్థాయిలో పరిరక్షిస్తే సమాజానికి తన వంతు మేలు చేసిన వారు అవుతారని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సంరక్షణ బాధ్యత తీసుకోవాలి..

పెడన: ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా మొక్కలు నాటారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ఫ్లోర్‌లీడర్ బళ్ల గంగయ్య, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. గురివిందగుంట గ్రామ సచివాలయం వద్ద ఎంపీపీ రాజులపాటి వాణి, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు మొక్కలు నాటారు. తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య వారి వారి కార్యాలయాల్లో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ అడ్మిన్ మొక్కలు నాటారు. ఎంఈఓ వైవీ హరనాథ్ ఎంపీపీ పాఠశాల (బంగ్లా స్కూల్)లో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

1,100 మొక్కలు నాటిన అధికారులు, డ్వాక్రా సభ్యులు

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నీడ నిచ్చే గానుగ, నేరేడు, వేప, తురాయి తదితర 1,100 మొక్కలను అధికారులు, డ్వాక్రా గ్రూపు మహిళలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు కలిసి నాటారు. ఎంపీడీఓ జె. స్వర్ణభారతి మాట్లాడుతూ భావితరాలకు కలుషితంలేని స్వచ్ఛమైన గాలిని అందజేసేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఎంఈఓ వెంకటేశ్వరరావు, ఏపీఎం డి. శ్రీను, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, ఏపీఓ ముత్యాలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



బందరులో ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న కలెక్టర్ సతీమణి సుజాత, జేసీ అపరాజిత సింగ్



పెడన మున్సిపల్ కార్యాలయం వద్ద మొక్క నాటిన చైర్‌పర్సన్ నాగకుమారి



మోపిదేవి ఎంపీడీఓ కార్యాలయంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీపీ దుర్గావాణి

ఆగస్టులో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం

జిల్లా ఎస్పీ జాషువా



నూతన పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జాషువా

మోపిదేవి: టూరిజం టెంపుల్‌గా అభివృద్ధి చెందుతున్న వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానానికి సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు సౌకర్యార్థం మోపిదేవిలో పర్మినెంట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ జాషువా తెలిపారు. సుమారు రూ. 1.40 కోట్లతో అన్ని అత్యాధునిక సౌకర్యాలతో సిద్ధం చేసిన పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదగా ఆగస్ట్ మూడో వారంలో పోలీస్ స్టేషన్ ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అవుట్ పోస్టు అక్కడే భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం టూరిజం, టెంపుల్ అవుట్ పోస్టుగా కొనసాగుతుందని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి

చల్లపల్లి నుంచి మోపిదేవి వార్పు వరకు నూతనంగా విస్తరించిన జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. అవుట్ పోస్టులో శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి ప్రయాణాలపై ఆయా ప్రాంతాల వాసులకు సరైన అవగాహన లేదని చెప్పారు. అడిషనల్ ఎస్పీ ఆర్. శ్రీహరి బాబు, ఎస్‌ఐలు సీహెచ్ పద్మ, కె. శ్రీనివాసరావు, చిన బాబు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అమలుతో తగ్గిన పేదరికం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



పులిగడ్డలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదరికం తగ్గిందని సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధి పులిగడ్డలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 986 మందికి ఎమ్మెల్యే సింహాద్రి పలు రకాల సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. మన రాష్ట్రంలో అమలుచేస్తున్న అమ్మ ఒడి, నాడు–నేడు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న సురక్ష తదితర సంక్షేమ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారని చెప్పారు. ఈ పథకాల పనితీరుని పరిశీలించేందుకు పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వచ్చి చూసి ప్రశంసిస్తున్నారని వివరించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్ని విమర్శలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇంకా క్రేజ్ పెరుగుతూనే ఉందన్నారు. అనంతరం ప్రపంచ ప్రకృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని సచివాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన..

అవనిగడ్డ డీఎస్పీ కార్యాలయం రోడ్డులో జెడ్పీ నిధులతో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయకుమార్, నాయకులు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఘంటసాలపాలెంలో 810 సర్టిఫికెట్ల అందజేత..

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలపాలెంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 810 మందికి, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేవీ సుబ్బారావు, ఘంటసాలపాలెం, తాడేపల్లి సర్పంచ్‌లు దోనె రజని, పడమట సీతామహాలక్ష్మీ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు..

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘంటసాల మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాగోలు(చల్లపల్లి): స్థానిక గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. పాగోలు గ్రామ సచివాలయం పరిధిలోని పాగోలు, లంకతోట, మేకావారిపాలెం, శ్రీనగర్ గ్రామాల దరఖాస్తుదారులకు 788 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, ఎంపీడీఓ సీహెచ్ చిన రాట్నాలు, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, గ్రామ ప్రత్యేకాధికారి భోగాది జగత్, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, ఫుడ్ కమిటీ సభ్యులు కుందేటి కోటేశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లంపూడి, పెందుర్రులో..

బంటుమిల్లి: మండల పరిధి పెందుర్రు, మల్లంపూడి గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో 513 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, వైస్ ఎంపీపీ ఓడిమి చిన్నారిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, డైరెక్టర్ ఎం. నాంచారమ్మ, ఎంపీటీసీలు మాదాసు లక్ష్మీశకుంతల, కొక్కిలిగడ్డ కనకదుర్గ, సర్పంచ్ రేవు శ్రీనివాసరావు,సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎలాంటి నష్టం జరగకూడదు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు. చిత్రంలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా తదితరులు

- ముందస్తు చర్యలు చేపట్టండి
- కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఎస్పీ జాషువా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, అడిషనల్ ఎస్పీ ఆర్. శ్రీహరిబాబు, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం సీఎం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశహాల్‌లో కలెక్టర్ రాజాబాబు జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలు, ఎగువ నుంచి కృష్ణానది ద్వారా వస్తున్న వరదనీటి ప్రవాహంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, కృష్ణానది పరివాహక ప్రాంతంలోని కట్టలను నిత్యం పర్యవేక్షించాలన్నారు. ముందస్తుగా ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలన్నారు. డయేరియా, ఇతర వ్యాధులు వ్యాప్తి చెందకుండా పట్టణాలతో పాటు గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. క్రమం తప్పకుండా క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లాలన్నారు. పశువులకు వ్యాధులు సంక్రమించకుండా చర్యలు తీసుకోవాలని, మేత కొరత లేకుండా చూడాలని చెప్పారు. వర్షాల కారణంగా ప్రజా రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రభుత్వాస్పత్రిలో పాముకాటుకు యాంటీ వీనమ్ ఇంజక్షన్లను అన్ని పీహెచ్‌సీల్లో ఉంచాలని, ఎంఎల్ఎస్ పాయింట్లలో రేషన్ సరుకులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

నేడు మొహర్రం రుధిర తర్పణం

- కర్బలా అమరవీరులకు నివాళులర్పించనున్న షియా ముస్లింలు
- సిద్ధమైన కోనేరు సెంటర్



చెస్ట్ బీట్ నిర్వహించేందుకు సిద్ధమైన కోనేరు సెంటర్

మచిలీపట్నంటౌన్: నాడు కర్బలా మైదానంలో వీర మరణం పొందిన అమరవీరులను స్మరిస్తూ షియా ముస్లింలు శనివారం నగరంలోని కోనేరు సెంటర్ వేదికగా రుధిర తర్పణం చేయనున్నారు. మొహమ్మద్ ప్రవక్త మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌తో పాటు 72 మంది సమస్త మానవాళి కోసం కర్బలా మైదానంలో జరిగిన పవిత్ర యుద్ధంలో వీర మరణం పొందారు. వారిని స్మరిస్తూ షియా ముస్లింలు గత 10 రోజులుగా దుఃఖదినాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 11వ రోజైన శనివారం మొహర్రంను నిర్వహించనున్నారు. స్థానిక కోనేరు సెంటర్‌కు నగరంలోని షియా ముస్లింలు చేరుకుని చెస్ట్ బీటింగ్ నిర్వహిస్తారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వయస్సుల వారు చెస్ట్ బీటింగ్ ద్వారా రక్తాన్ని చిందించి నివాళులర్పిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

ఉదయం నగరంలోని చిన్న పార్టీ, పెద్ద పార్టీలు కోనేరు సెంటర్‌కు చేరుకుని కర్బలా వీరులకు రక్తతర్పణం చేస్తారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రక్తతర్పణం చేసే సమయంలో కింద పడే రక్తం నిలిచి పోకుండా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటిని చల్లుతూ శుభ్రం చేస్తారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువ రక్తస్రావం అయ్యేవారికి, నీరసంగా ఉన్న వారికి ఈ శిబిరంలో వైద్యసేవలు అందిస్తారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా తదితర నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై చెస్ట్ బీటింగ్‌లో పాల్గొనే ముస్లింలకు నీటిని చల్లి, పానీయాలను అందిస్తారు. మొహర్రం దుఃఖదినాల సందర్భంగా ముస్లింలు ఇప్పటికే నల్లని దుస్తులు ధరించడంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో నల్లజెండాలను ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు యా హుస్సేన్, యా అబ్బాస్ నినాదాలతో బ్యానర్లను ఏర్పాటు చేశారు. చెస్ట్ బీటింగ్ నిర్వహించే కోనేరు సెంటర్ చుట్టూ నల్లజెండాలను ఏర్పాటు చేశారు.

సంక్షేమ పథకాలను సక్రమంగా అందించండి



మచిలీపట్నంటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని జిల్లా బీసీ, కాపు కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎ. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని కొబ్బరితోట–1, 2, పరాసుపేట, లక్ష్మణరావుపురం సచివాలయాలను సందర్శించి మాట్లాడారు. కాపు నేస్తం పథకానికి అర్హులైన లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కాపు నేస్తంకు ఆయా సచివాలయాల పరిధిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 కు సంబంధించి ఓటర్ల జాబితా తయారీపై ఎన్నికల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఓటర్ల జాబితా తయారీ పురోగతిని కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆగస్ట్ 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జిల్లా కలెక్టర్లతో ఎన్నికల సంఘం నిర్వహించనున్న సమీక్షా సమావేశానికి ఆయా జిల్లాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. కృష్ణా జిల్లాకు సంబంధించి ఎన్నికల అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంవీ శ్యామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండకు నిరసన

చల్లపల్లి: అధికార దాహంతో మతాల మధ్య చిచ్చుపెట్టి విజయం సాధించాలని చూస్తున్న బీజేపీ మతోన్మాద రాజకీయాలు నశించాలని సీపీఎం జిల్లా నాయకుడు వాకా రామచంద్రరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రధాన కూడలిలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ నరేంద్రమోడీ గుజరాత్ తరహాలో మణిపూర్‌లో మత చిచ్చు పెట్టి మూడు నెలలుగా రావణకాష్టం రగిల్చి చోద్యం చూస్తున్నారన్నారు. ప్రజలంతా పార్టీలకు అతీతంగా ఇలాంటి మత రాజకీయాలను, మారణకాండను అడ్డుకోవాలని కోరారు.

పాత ఎడ్లంకకు నిలిచిన రాకపోకలు

వరద ప్రభావంతో రహదారికి గండి



పాత ఎడ్లంక వద్ద రహదారిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాత ఎడ్లంక(అవనిగడ్డ): వరద ఉధృతి పెరగడంతో పాత ఎడ్లంక గ్రామానికి వెళ్లే రహదారికి గండి పడింది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి వెళ్లాలంటే నదీపాయలలో తూములతో రహదారిని ఏర్పాటు చేశారు. వరద ఉధృతికి ఈ రహదారికి గండి పడింది. రహదారి పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, ఎస్‌ఐ రమేష్, రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి ప్రజల రాకపోకల కోసం ప్రత్యామ్నాయంగా పడవలను ఏర్పాటు చేయించారు. వరద ఉధృతి పెరిగితే చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు.

ఎలకుర్రు డ్రెయిన్ సమస్యకు పరిష్కారం చూపుతాం

గూడూరు: ఎలకుర్రు డ్రెయిన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. భారీ వర్షాలకు ఎగువ నుంచి ముంపు నీరు కిందికి పారటానికి రెండు తూములు చాలకపోవడంతో మరో రెండు తూములు ఏర్పాటు చేయటానికి శుక్రవారం ఎలకుర్రు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తూముల సంఖ్య పెంచితే తమ ప్రాంతంలోని పంట పొలాలు మునిగి పోతాయంటూ ముక్కొల్లు, జక్కంచర్ల, కలపటం, కంకటావ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు తమ సమస్యను మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు ప్రజాప్రతినిధులు, అధికారులను సమస్యాత్మక ప్రాంతానికి పిలిపించి చర్చలు జరిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తూముల సంఖ్య పెంచడానికి అవకాశం లేదని, వచ్చే వేసవిలో తూముల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపి ఇరు వర్గాలను ఒప్పించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆదివారం విజయవాడలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర స్థాయి కార్మిక సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.